## క్లుప్తంగా

### 30న నియోజకవర్గ కార్యకర్తల సమావేశం


నూకతోటి రాజేష్

నాగలాపురం: సత్యవేడులోని బేరిశెట్టి కళ్యాణ మండపంలో ఈ నెల 30న నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ తెలిపారు. ముఖ్య అతిథిగా పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పాల్గొంటారని, పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### పోస్టాఫీసు ఖాతాలు ప్రారంభం



సత్యవేడు: మండలంలోని కాళమనాయుడుపేట సచివాలయం వద్ద సత్యవేడు పోస్టాఫీసు సిబ్బంది ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు (ఏపీపీబీ) అకౌంట్లను ప్రారంభించారు. బుధవారం ఎంపీడీఓ, పోస్టాఫీసు సిబ్బంది కలసి ఆధార్ కార్డులకు ఏపీపీబీ ఖాతాలకు ఫోన్ నంబర్లు అనుసంధానం చేశారు. తొలిరోజు 90 మందికి పైగా ఫోన్ నంబర్లు అనుసంధానం చేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ దినేష్, సచివాలయ కార్యదర్శి హరీష్, కుముద, వెల్ఫేర్ అసిస్టెంట్ శామ్యూల్, డిజిటల్ అసిస్టెంట్ గోవర్ధన్, మహిళా పోలీస్ కళ, ఖాతాదారులు పాల్గొన్నారు.

### జ్యోతిష్యంలో పరశురామ్ గురుకుల్‌కు డాక్టరేట్



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అర్చకత్వం వహిస్తున్న పరశురామ్ గురుకుల్‌కు జ్యోతిష్యశాస్త్రంలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. మధురై సమీపంలోని తిరుపరకుండ్రం వద్ద ఉన్న శ్రీ గురురాఘవేంద్ర జ్యోతిష్య రీసెర్చ్ సెంటర్‌లో డాక్టర్ వేలుస్వామి పర్యవేక్షణలో మూడేళ్లపాటు పరిశోధనలు చేశారు. దీంతో బుధవారం ఆయనకు డాక్టరేట్ అందజేశారు.

### స్వర్ణ పంచాయతీ సర్వే పూర్తి చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీలతో చేస్తున్న స్వర్ణ పంచాయతీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి స్వర్ణ పంచాయతీ సర్వేపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 28 గ్రామ పంచాయతీలలో 9,060 ఇళ్ల సర్వేను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. స్వర్ణ పంచాయతీ సర్వేలో ప్రతి ఇంటి డేటాను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తారని, దీంతో హౌస్ ట్యాక్స్‌ను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### బదిలీ ఉద్యోగినికి వీడ్కోలు సన్మానం



బుచ్చినాయుడుకండ్రిగ: మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై పరిపాలనాధికారిణిగా శ్రీకాళహస్తికి బదిలీపై వెళ్లిన గుల్షన్‌బేగంను బుధవారం కార్యాలయంలో ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు అరణి విద్యానాథరెడ్డి, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆమె సేవలను కొనియాడారు.

### గౌడ సంఘ కార్యాలయం ప్రారంభం

శ్రీకాళహస్తి: పట్టణంలో బుధవారం గౌడ సంక్షేమ సంఘం నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం యూత్ ప్రెసిడెంట్‌గా కళత్తూరు రవికుమార్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌడ సంఘం నాయకులు అత్తిరాల శ్రీరాములు గౌడ్, మోహన్ గౌడ్, ఈశ్వరయ్యగౌడ్, దుర్గాప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

### ఇసుక అక్రమ రవాణా చేస్తే కేసులు

సత్యవేడు: ట్రాక్టర్ ఓనర్లు ఇసుక అక్రమ రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ మురళీ నాయుడు హెచ్చరించారు. బుధవారం ట్రాక్టర్ యజమానులకు సమావేశం ఏర్పాటు చేసి సీఐ మాట్లాడారు. ప్రభుత్వ భవనాలు, సిమెంటు రోడ్ల నిర్మాణానికి అనుమతులతో ఇసుక తరలించాలన్నారు. ఎస్ఐ రామస్వామి పాల్గొన్నారు.

### హోమియో వైద్య శిబిరం



రేణిగుంట: మండలంలో ప్రతి 15 రోజులకోసారి హోమియోపతి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రవి చంద్రారెడ్డి కోరారు. రేణిగుంట పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం పంచాయతీ వార్డు సభ్యులు ఎంజి రాజేష్ రెడ్డి సహకారంతో ఉచిత హోమియోపతి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో హోమియోపతి శాస్త్రవేత్త డాక్టర్ రవి చంద్రారెడ్డి, హోమియోపతి వైద్యులు హారిక, అవంతి రోగులను పరీక్షించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

ఉరుస్తున్న ఇళ్ల సమీపంలో పూరిపాకలు



కాలనీలో శిథిలావస్థకు చేరి ఉరుస్తున్న పక్కాగృహాలు



ఒక ఊరి వ్యథ

# బతుకు దుర్భరం.. అభివృద్ధికి దూరం

**సత్యవేడు మండల కేంద్రానికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలోని రాళ్లకుప్పం గిరిజన కాలనీ ఐదు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా, ఎందరో ప్రజానిధులు ఉంటున్నా మౌలిక వసతులు కల్పించిన పాపానపోవడం లేదు. ఫలితంగా గిరిజ కాలనీలో 11 కుటుంబాల ప్రజలు దుర్భర పరిస్థితుల నడుమ జీవిస్తున్నారు. కాలనీ ఆవిర్భావం నుంచి రోడ్డు, తాగునీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నారు.**

- బండిబాటే కాలనీకి దారి
- తాగునీటికి ఊటగుంటే ఆధారం
- స్కూలుకు వెళ్లాలంటే పొలం గట్లే దిక్కు
- దశాబ్దాలుగా దరి చేరని మౌలిక వసతులు
- సర్పంచ్ తప్పితే గ్రామంలో అడుగుపెట్టని ఎమ్మెల్యే, అధికారులు!
- ఇదీ రాళ్లకుప్పం గిరిజన కాలనీ వ్యథ

సత్యవేడు: మండలంలోని వానెల్లూరు పంచాయతీ కేంద్రానికి కిలోమీటరు దూరంలో రాళ్లకుప్పం గిరిజన కాలనీ ఉంది. ఇక్కడ ఉన్న 11 కుటుంబాల్లో ఒక్కో కుటుంబంలో 5 నుంచి ఆరుగురు కుటుంబ సభ్యులు ఉంటున్నారు. అందరూ వ్యవసాయ కూలీ పనులపై ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్నారు. అలాగే 20 వరకూ పశువులు, 60 నుంచి 70 వరకూ మేకలు, మేకపోతుల పెంపకంపై ఆధారపడ్డారు. రాళ్లకుప్పం నుంచి పొలాలకు వెళ్లే బండి బాట కాలనీ సమీపం వరకు ఉంది. అక్కడి నుంచి పొలం గట్ల మీదుగా ఇళ్లకు వెళ్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అధికారంలో ఉన్నప్పుడు దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రభుత్వ గృహాలు ఎప్పుడో శిథిలావస్థకు చేరాయి. వర్షాలకు ఉరుస్తున్నాయి. ప్రతిసారీ దీంతో గుడిసెలు వేసుకుని వాటిల్లో కాపురాలు ఉంటున్నారు. కాలనీ పిల్లలు బడికి వెళ్లాలన్నా పొలం గట్లే బాట. వర్షాకాలంలో అయితే ఇబ్బందులు చెప్పనలవి కాదు. పంటలు సాగు చేసే రైతులు గట్లపై ముళ్ల కంపలు వేసి ఉండడంతో దారి లేక రెండు కిలోమీటర్లు దూరం నడిచి స్కూలుకు వెళ్లాల్సిన వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**గుంట నీరే ఆధారం**

కాలనీ గిరిజనులకు కనీసం తాగునీటి వసతికి కనీసం చేతి బోరు కూడా పాలకులు వేయించిన పాపానపోలేదు. కేవలం సర్పంచ్ తప్పితే ఆ వూరిలో అడుగుపెట్టిన ఎమ్మెల్యేగానీ, అధికారులుగానీ లేరంటే అతిశయోక్తి కాదు. సరిగా దారి లేదనే కారణంతో రోడ్డు వరకు గిరిజనులనే రప్పించి, వారితో మాట్లాడి వెళ్లడం పరిపాటి అదీనూ అరుదుగా..! ఇక తాగునీటి కోసం కాలనీకి వంద మీటర్ల దూరంలో ఉన్న ఊట గుంట చెలమపై ఆధారపడ్డారు. ఆ గుంటలో పశువులు దిగకుండా ముళ్లకంచె వేసి కాపాడుకుంటున్నారు. వర్షాకాలంలో ఊట నీరు ఉంటుంది. వేసవిలో ఒట్టిపోతుంది. కొంత లోతు గుంత తవ్వితే బిందె నీరు ఊరేందుకు గంటల సమయం వేచి ఉండాల్సి వస్తోంది. చేతిబోరు వేయండి..హౌసింగ్ కాలనీ మంజూరు చేయండి మహాప్రభో అని అధికారులను ఏళ్లకాలంగా గ్రామస్తులు కోరుతున్నా వారి గోడు అరణ్య రోదనే అవుతోంది.


ఎస్టీ కాలనీలో మేకల దొడ్డి


తాగునీటి కోసం గిరిజన కాలనీ వాసులు ఆధారపడిన ఊట గుంట


గిరిజకాలనీకి దారిగా ఉంటున్న బండి బాట

### ప్రభుత్వ పథకాలకు దూరం



ఎన్నికలప్పుడు పెద్దోళ్లకు మేము గుర్తుకు వస్తాం. మీకు రోడ్డు వేస్తాం. నీటి వసతి కల్పిస్తాం. లైట్లు వేస్తాం అంటారు. ఏదైనా ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు ఊర్లోనే పెట్టేస్తారు. మాబోటి పేదోళ్ల వద్దకు ఏ ప్రభుత్వ పథకాలనూ తీసుకురారు. ఎన్నికలప్పుడు కాలనీలో ఇండ్లు, రోడ్డు వసతి కల్పించాలని కోరాం. ఇంతవరకు అతీగతీ లేదు. మాకు మేలు చేసేవాళ్లు లేరు. మా కష్టం మాదేనని బతుకుతున్నాం.

**చెంగమ్మ, గిరిజ కాలనీ రాళ్లకుప్పం.**

### ఎండాకాలంలో తాగునీటికి ఇక్కట్లు



తాగునీటి కోసం మేము ఆధారపడిన ఊట గుంట ఎండాకాలం వస్తే ఎండిపోతుంది. సమీపం పొలాల్లోని బావుల్లో మోటార్లు పెడితే గుంటలో నీరు ఎండిపోతుంది. నీళ్ల కోసం రైతుల బావుల కాడికిపోతే..ఇక్కడికి రాకండి అని ముఖం మీదే కొట్టినట్లు చెబుతున్నారు. ఎండాకాలం వస్తే తాగునీటిక అవస్థలు పడుతున్నాం. మా కాలనీలో వసతులు కల్పించకపోవడంతో చాలమంది వలస వెళ్లారు. మాపెద్దోళ్ల గుర్తు కోసం మేం ఇక్కడే ఉంటున్నాం.

**-అంకమ్మ, గిరిజన కాలనీ, రాళ్లకుప్పం**

### రోగమొస్తే చావే..!



ఇక్కడ ఉన్నోళ్లకు ఏవైనా రోగాలు వస్తే రోడ్డు కాడికి తీసుకుని పోయేందుకు పొలాల్లో పడిలేస్తూ పోవాల్సిందే. అదో పెద్ద చావు మాకు. మా కాలనీకి ఏఎన్ఎంలు, మందుల బండిరాదు(104),(108).. ఇది వరకు వచ్చింది లేదు. మా పెద్దోళ్లు చెప్పిన నాటు వైద్యమే దిక్కు. పెద్ద జబ్బు వస్తే సత్యవేడు ఆస్పత్రికి వెళ్తాం. మాకు ప్రభుత్వం ఇచ్చిన డీకేటీ భూమిని ఎస్ఈజెడ్‌లో తీసుకున్నారు. కౌలు భూమి చేసుకుంటూ బతుకుతున్నాం. పంటలు సరిగా పండకపోవడంతో వ్యవసాయం వదలి కూలి పనులకు వెళుతున్నాం. మేకలు, ఆవులు మేపుకుంటుజీవిస్తున్నాం.

**-గంగయ్య, గిరిజన కాలనీ రాళ్లకుప్పం**

## బాల్య వివాహాలను రూపుమాపుదాం

శ్రీకాళహస్తి: బాల్య వివాహాలను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని శ్రీకాళహస్తి న్యాయస్థాన 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ పిలుపునిచ్చారు. బాల్య వివాహాల నిర్మూలన, చట్టాలపై బుధవారం స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో బాల్య వివాహాల నిర్మూలన, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ, చదువుకునే వయసులో చదువుపైనే దృష్టి పెట్టి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఆడపిల్లలకు 18, మగపిల్లలకు 21 ఏళ్లు పూర్తయిన తర్వాతే వివాహం చేయాలన్నారు. న్యాయపరమైన సమస్యలు ఉంటే 15100 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, ప్రిన్సిపల్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

**నాగలాపురంలో..**

నాగలాపురం. బాల్య వివాహాలను రూపుమాపేందుకు అందరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీ దేవి కోరారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

శ్రీదేవి మాట్లాడుతూ, బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం వివాహానికి అమ్మాయిలు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు విధిగా నిండి ఉండాలని, ఆ వయస్సులోపు పెళ్లి చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలను ఎవరు ప్రోత్సహించినా వారికి లక్ష జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష విధిస్తారని హెచ్చరించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్న పక్షంలో 1098 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ హనుమాన్ నాయక్, ఎంఈఓ బాబయ్య, జనార్ధనరాజు, ప్రధానోపాధ్యాయులు పూడి కస్తూరయ్య, విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

### అభయ క్షేత్రంలో అన్నదానం



రేణిగుంట: స్థానిక బిస్మిల్లానగర్‌లోని అభయ క్షేత్రంలో బుధవారం చందన వెల్‌నెస్ సెంటర్ అన్నదానం చేసింది. వర్తినేని కొండప నాయుడు జన్మదినం సందర్భంగా చందన వెల్‌నెస్ సెంటర్ అధినేత శ్రీనివాసులు నాయుడు, చందన ఈ అనాథలు, దివ్యాంగుల నడుమ ఈ కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకురాలు తస్లీమ్ పాల్గొన్నారు.

## స్కూళ్ల అభివృద్ధికి అందరి భాగస్వామ్యం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రాజు


నాగాలాపురం: మాట్లాడుతున్న ఎంఈఓ జనార్ధనరాజు

**-ఇన్‌చార్జ్ డీవైఈఓ పిలుపు**

నారాయణవనం: పాఠశాలల అభివృద్ధికి తల్లిదండ్రులను, ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయించడంపై శ్రద్ధ వహించాలని పుత్తూరు ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఈఓ, నారాయణవనం ఎంఈఓ–1 ప్రభాకర్‌రాజు ఆదేశించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ గుణశేఖర్ అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలకు సమావేశం నిర్వహించారు. ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో డిసెంబర్ 7వ తేదీ పేరెంట్స్, టీచర్స్ సమావేశం (పీటీఎం) నిర్వహించాలన్నారు. సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలను ఆహ్వానించాలన్నారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీఓ మాట్లాడారు. సమావేశంలో మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్, ఈఓపీఆర్డీ డాక్టర్ వేణయ్య, ఎంఈఓ–2 జనార్ధనరాజు, ఏపీఎం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

**నాగలాపురంలో..**

నాగలాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లస్‌లో బుధవారం ఎంఈఓ బాబయ్య, జనార్ధనరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ, డిసెంబర్ 7న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహిస్తామని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. తహసీల్దార్ హనుమాన్ నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, మంజుల, ఉపాధ్యాయులు గోపి, ముని, సుబ్రమణ్యం, శ్రీనాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**ఏర్పేడు మండలంలో..**

రేణిగుంట(ఏర్పేడు): వచ్చే నెల 7న రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్న మెగా పేరెంట్..టీచర్ సమావేశాలు పాఠశాలలోని బోధనాభ్యసన ప్రక్రియ పురోభివృద్ధికి దోహదం చేసేలా ఉండాలని ఏర్పేడు ఎంఈఓ ప్రేమలత అన్నారు. పాపానాయుడుపేటలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అలాగే ఏర్పేడు ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాల్‌లో ఏర్పేడు, పల్లం, పంగూరు, బండారుపల్లె క్లస్టర్ల పరిధిలోని ఉపాధ్యాయులకు ఎంఈఓ–2 దయాకర్ రావు సమావేశం నిర్వహించి కార్యక్రమం గురించి వివరించారు.


రేణిగుంట: మాట్లాడుతున్న ఏర్పేడు ఎంఈవో ప్రేమలత

### ఎమ్మెల్సీ నివాళి


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

రేణిగుంట(ఏర్పేడు): ఏర్పేడు మండలం పాత వీరాపురం మాజీ ఎంపీటీసీ కోదండరామిరెడ్డి ఇటీవల మృతి చెందడంతో బుధవారం ఆయన ఇంటికి ఎమ్మెల్సీ సభ్యుడు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం వెళ్లి చిత్రపటానికి నివాళి అర్పించారు. ఎంపీటీసీగా ఆయన గ్రామానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చెంబేటి మునిరత్నంరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఆ నలుగురూ..పోలీసులే!

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం వద్ద రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ మల్లికార్జున్, సిబ్బంది చొరవతో సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి శవ పంచనామా నిర్వహించారు. బుధవారం ఎస్ఐ ఆదేశాలతో హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా బత్తలవల్లం శ్మశానవాటిక ప్రాంతంలో ఆ వ్యక్తి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

### లారీ ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు


గాయాలైన అరవింద్

నాగలాపురం: లారీ ఢీకొనడంతో మోటార్ సైకిలిస్టులు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం మండలంలోని అచ్చమనాయుడు కండ్రిగ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం..చెన్నై నుంచి జిప్సం లారీ తిరుపతి మీదుగా తాడిపత్రికి వెళ్లింది. అదే సమయంలో తమిళనాడులోని తిరువళ్లూరుకు చెందిన అరవింద్(28), నరసింహులు(26) సొంత పని నిమిత్తం తిరుపతి నుంచి తమ సొంతూరుకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా అచ్చమనాయుడు కండ్రిగ తిరుపతి–చెన్నై జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న లారీ వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని 108లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నరు.

### నియామకం


రామేశ్వర స్వరూప్ స్వామి

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీసాధు రామలింగస్వామి సంస్కృత పాఠశాలలో బుధవారం కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. నూతన కరస్పాండెంట్‌గా బ్రహ్మచారి రామేశ్వర స్వరూప్ స్వామిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పరమాత్మ నందగిరిస్వామి, కోశాధికారి శ్రీరామచైతన్య, గౌరవ సలహాదారు వెంకట్రాయలు, న్యాయ సలహాదారు కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

### సీఎం సహాయనిధికి విరాళం


విరాళం అందజేస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్

శ్రీకాళహస్తి: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో సేకరించిన రూ.35వేల విరాళాన్ని ముక్కంటి దర్శనానికి వచ్చిన కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ విజయరామరాజుకు అందజేశారు. వరదలు, ఇతర సహాయ కార్యక్రమాలకు వినియోగించేందుకు బాలికల జెడ్పీ హైస్కూల్, బాబు అగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ విరాళాన్ని సేకరించారు. కార్యక్రమంలో డీఈఓ కుమార్, తిరుపతి, పుత్తూరు డీవైఈఓలు బాలాజీ, ప్రభాకర్, ఎంఈఓ భువనేశ్వరి, జిల్లా స్కౌట్ కమిషనర్లు రమేష్‌బాబు, ఎంఎం రెడ్డి, యూత్ చైర్మన్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

**ముక్కంటి సేవలో..**


యోగిబాబు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని బుధవారం రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు, ప్రముఖ తమిళ హాస్యనటుడు యోగిబాబు దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

### స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ పొందిన విద్యార్థులు

నారాయణవనం: మండలంలోని పాలమంగళం ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేసినట్లు హెచ్‌ఎం మనోహరి తెలిపారు. పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయుడు గోపి ఈ మెటీరియల్‌ను రూపొందించారని, మొత్తం 88 మంది విద్యార్థులకు ఆయన అందజేసినట్లు చెప్పారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించడానికి ఇది ఉపయోగపడుతుందని హెచ్‌ఎం పేర్కొన్నారు. ఇదలా ఉంచితే, గత వారం తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించి గోపిని అభినందించి సత్కరించారు.

## న్యుమోనియా రహిత బాల్యమే లక్ష్యం


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రేణిగుంట: సమాజానికి న్యుమోనియా రహిత బాల్యం అందించడమే లక్ష్యమని మాస్ మీడియా డిప్యూటీ డెమో భానుమూర్తి స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని 3, 4 సచివాలయాల పరిధిలో సార్వత్రిక వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాస్ మీడియా అధికారులు భానుమూర్తి, కిరణ్ కుమార్, రేణిగుంట పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు పాల్గొని గర్భవతులు, బాలింతలు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల కార్యకర్తలకు న్యూమోనియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భానుమూర్తి మాట్లాడుతూ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆరోగ్య సిబ్బంది గ్రామస్థాయిలో న్యూమోనియాపై అవగాహన కల్పించి తగిన జాగ్రత్తలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్ఎంలు విజయలక్ష్మి, లోహిత తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగమేళాలో 33మంది ఎంపిక


ఉద్యోగమేళాలో ఎంపికైన వారితో అధ్యాపకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఉద్యోగమేళాలో 33మంది ఎంపికయ్యారని ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ నరసింహవర్మ తెలిపారు. జేకేసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మేళాలో డిక్సన్ టీవీ మాన్యుఫాక్చరింగ్, ఎంఆర్ఎఫ్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 45మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి 33మందిని చేశారు. వారికి కంపెనీల హెచ్‌ఆర్‌లు శ్రావణ్‌కుమార్, హర్ష నియాకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జేకేసీ కో–ఆర్డినేటర్ గంగారాం, ఎఫ్‌టీఎం గిరిజమ్మ తదితరులు పాల్గొన్నారు.

### నేడు 'కార్తీక వన భోజనం'

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో గురువారం భరద్వాజతీర్థంలో వన భోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓ బాపిరెడ్డి బుధవారం తెలిపారు. ఆలయ సిబ్బంది, కుటుంబ సభ్యులు, ప్రముఖులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.